క్లుప్తంగా

కోదండ రామాలయంలో సిబ్బంది విచారణ

జగ్గయ్యపేట: పట్టణంలోని కోదండ రామాలయంలో సోమవారం సాయంత్రం కాకినాడ దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ విజయరాజు సిబ్బందిని విచారించారు. ఆలయంలో కొద్ది నెలల క్రితం పలు అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు రావటంతో విచారణ చేశామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఈవో సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని సర్పంచ్ జక్కులూరి రాంబాబు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కొత్తగా మంజూరైన పింఛన్లను సోమవారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన మాట మేరకు పింఛన్ మొత్తాన్ని పెంచుతూ సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయంతో ఎందరికో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల సముదాయానికి శంకుస్థాపన



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయం వద్ద ఉత్తరం వైపున నూతనంగా నిర్మించనున్న దుకాణాల సముదాయానికి సోమవారం ఆలయ ఈఓ కె.రమేష్ నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు భూమి పూజ, శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది,పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రమేష్‌బాబు బాధ్యతల స్వీకారం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.రమేష్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పెనుగంచిప్రోలు ఎంపీడీవో ప్రసాద్ పనిచేశారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండల పరిషత్ ఏవోగా పనిచేస్తున్న రమేష్‌బాబును ఉద్యోగోన్నతిపై ఇక్కడకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

స్పందనకు ఆరు అర్జీలు

వీరులపాడు: స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి ఒక్క అర్జీని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆశయ్య నాయక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని సమస్యలను అర్జీల రూపంలో తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆరు అర్జీలు అందాయని చెప్పారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

జగ్గయ్యపేటఅర్బన్: పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామానికి చెందిన కరివేదా జగన్నాథరావు ఇటీవల మోకాళ్ల ఆపరేషన్ చేయించుకున్నారు. ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.65 వేల చెక్కును సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి మండల స్కూల్ గేమ్స్ ఎంపికలు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మండల స్కూల్ గేమ్స్ ఎంపికలు ఈనెల 20 వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని గేమ్స్ మండల ఇన్‌చార్జ్ ఎం.సోడానాయక్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ గ్రౌండ్స్‌లో బాలబాలికలకు అండర్–14, అండర్–17 విభాగాలకు మొత్తం 9 రకాల క్రీడల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. బాలురు అండర్–14 51 కేజీలు, అండర్–17 57 కేజీలు, బాలికలు అండర్–14 48 కేజీలు, అండర్–17 53 కేజీల బరువు కలిగి ఉండాలని, ప్రభుత్వ గానీ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల నుంచి గానీ క్రీడాకారులు పాల్గొనవచ్చునని తెలిపారు. పాల్గొనే వారు తమ ఆధార్ జిరాక్స్ తీసుకుని రావాలని, వివరాలకు సెల్ నంబర్ 91105 71722 లో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య సమాజ నిర్మాణమే లక్ష్యం

- ఇంటి వద్దకే సంపూర్ణ పోషణ కిట్లు
- గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం
- నియోజకవర్గ ఐసీడీఎస్ పరిధిలో 11,098 మంది లబ్ధిదారులు

ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషణ వివరాలు

సరుకులు	పరిమాణం
బియ్యం	3 కేజీలు
కందిపప్పు	1 కేజీ
వంటనూనె	500 ఎంఎల్
కోడిగుడ్లు	25
పాలు	5 లీటర్లు
రాగిపిండి	2 కేజీలు
అటుకులు	1 కేజీ
బెల్లం	250 గ్రాములు
చిక్కీ	200 గ్రాములు
ఖర్జూరం	250 గ్రాములు



గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను(ఫైల్)

చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో లబ్ధిదారుల వివరాలు

మండలం	గర్భిణులు	బాలింతలు	0.6 నుంచి 3 ఏళ్లలోపు	3 నుంచి 6 ఏళ్ల లోపు
జగ్గయ్యపేట	725	613	3561	1168
పెనుగంచిప్రోలు	279	237	1256	300
వత్సవాయి	348	272	1608	731
మొత్తం	1352	1122	6425	2199

పిల్లలకు అందిస్తున్న సంపూర్ణ పోషణ

బాలామృతం	2.5 కేజీలు
కోడిగుడ్లు	పాలు
25	2.5 లీటర్లు

పెనుగంచిప్రోలు: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత పటిష్టంగా అమలు చేస్తున్నారు. చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పకడ్బందీగా అమలవుతోంది. ఇందులో భాగంగా గత నెల నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు మాత్రం అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతోంది. చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో గర్భిణులు 1352, బాలింతలు 1122, మూడేళ్లలోపు చిన్నారులు 6425, ఆరేళ్లలోపు చిన్నారులు 2199 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

ఇంటి వద్దకే వైఎస్సార్ కిట్లు



రోజూ అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి రావాలంటే ఇబ్బంది పడుతున్నాం. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం జగనన్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను నేరుగా మా ఇంటి వద్దకే పంపించటం ఎంతో సంతోషంగా ఉంది.

–సంగు తిరుపతమ్మ, బాలింత

పోషక విలువలతో కూడిన ఆహారం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ మా పాలిట కామధేనువు. పేదరికంలో ఉన్న మాకు పోషక విలువలతో కూడిన మంచి ఆహారం అందిస్తున్నారు. ప్రసవానికి ముందు, తరువాత, ఆపై పుట్టిన బిడ్డలకు కూడా ప్రభుత్వం అందిస్తున్న సేవ వెలకట్టలేనిది.

–ముండ్లపాటి తిరుపతమ్మ, గర్భిణి

ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోంది



ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోంది. గర్భిణులకు రక్తహీనత కలగకుండా పోషకాహారం అందిస్తున్నాం. వీరి సంరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పథకాన్ని అమలు చేస్తోంది.

–పి.లక్ష్మీభార్గవి, సీడీపీఓ, చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం

ప్రభుత్వ విప్ ఉదయభాను



పట్టణంలోని 20,22 వార్డుల్లో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలే ఈ ప్రభుత్వానికి అండ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలో 10 వ నంబరు సచివాలయం పరిధిలోని 20, 22 వార్డుల్లో పెద్ద శివాలయం తదితర ప్రాంతాల్లో, 2 వ నంబరు సచివాలయం పరిధిలోని 5,9,7 వార్డుల్లో కాకానినగర్, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయభాను పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్ల కాలంలో ఆయా కుటుంబాలు ఏఏ పథకాల రూపేణా ఏ మేరకు లబ్ధి పొందారో వివరించారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, ఎస్టీ, కార్మిక విభాగాల పట్టణ అధ్యక్షులు బద్దూనాయక్, గోగుల వెంకయ్య, సచివాలయాల కన్వీనర్లు మంగు సాయిచైతన్య శర్మ, పూల నాగరాజు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

- రూ.40 లక్షలతో సహకార సంఘ భవనం
- ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సహకార సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం, స్ట్రాంగ్ రూమ్, గోడౌన్ భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా గాలికొదిలేస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతులకు సంక్షేమ పథకాలు అందించటంతో పాటు గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు సాగు మెలకువలు, సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా పురుగు మందులు, ఎరువులు, విత్తనాలను రాయితీపై అందించి రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నారని కొనియాడారు. మండల కేంద్రం వీరులపాడు నుంచి జుజ్జూరుకు మారిందని సహకార బ్యాంకు కూడా జుజ్జూరులో ఏర్పాటుకు చైర్మన్ చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, ఆవుల ప్రసాద్, సర్పంచ్ రమావత్ కోటి, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్ మీరా, సర్పంచ్‌లు పత్తిపాటి మల్లికార్జునరావు, గద్దె కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రెండేళ్ల పాటు విచారణ తర్వాతే అరెస్టు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట: అవినీతి కుంభకోణంలో రూ.241 కోట్లు కొల్లగొట్టిన స్కిల్ స్కాం నిందితుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అని అందుకే ఆయన జైలుపాలయ్యారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రెండేళ్ల పాటు విచారణ జరిగిన తరువాతనే సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్ట్ చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబుకు మద్దతుగా జనసేన, సీపీఐ వత్తాసు పలకటం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వానికి ఎవరిపై కక్ష లేదన్నారు. ఇకపై ప్రతి ఏడాది సెప్టెంబరు 10న ఎన్టీఆర్ ఆత్మశాంతి దినంగా జరుపుకోవాలన్నారు. ఈ కేసులో మరి కొంత మంది జైలుకు వెళ్లటం ఖాయమని తెలిపారు. సోమవారం టీడీపీ బంద్‌కు పిలుపునిచ్చినా ఆ ప్రభావం లేదన్నారు. సమావేశంలో కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మానేపల్లి బ్రహ్మం, జుబేర్, పెంటు శ్రీనివాసరావు, చైతన్యశర్మ, తుమ్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

ఆర్డీఓ రవీంద్రరావు



నందిగామ: అర్జీల రూపంలో అందిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి పలు సమస్యల పరిష్కారం కోరుతూ 4 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని ప్రతి మండల కేంద్రాలతో పాటు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

విజయశేఖర్ సేవలు చిరస్మరణీయం

చిల్లకల్లులో ముత్తినేని సంస్మరణ సభ



ముత్తినేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ఉదయభాను, వసంత, ఎమ్మెల్సీ అరుణకుమార్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్ సేవలు మరువలేనివని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలో సోమవారం ముత్తినేని సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ముత్తినేని చిత్ర పటానికి ఉదయభాను, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే కొనమనేని సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ విజయశేఖర్ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్‌గా సమర్థంగా నిర్వహిస్తూ అకాల మృతి చెందటం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, న్యూహోప్ చర్చి నిర్వాహకుడు ప్రభుదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, వేల్పుల రవికుమార్, గూడపాటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన ఎంపీడీఓ ప్రసాద్, వైద్యాధికారి ఇందిర

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్కపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొక నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటారన్నారు. అనంతరం ఈనెల 30 నుంచి అక్టోబర్ 30 వరకు అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు సేవలందిస్తారన్నారు. ఈ శిబిరాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల వైద్యులు, ఆరోగ్య కేంద్రాల వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. 14 రకాల పరీక్షలతో పాటు 105 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, వైద్యాధికారి పి.ఇందిర, ఎంఈఓ డి.రవీంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఏఓ సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో జగనన్న ఆరోగ్య సురక్షపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్ బాబు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 29 వరకు అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళ్లి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. అందుకు ప్రత్యేక యాప్‌ను కూడా సిద్ధం చేశామని చెప్పారు. గ్రామ స్థాయిలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు రెండు బృందాలుగా ఏర్పడి సర్వే చేయాలన్నారు. ప్రజల నుంచి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని యాప్‌లో పొందుపరిచి ఈ నెల 30న సచివాలయాల వారీగా ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బూచవరం వైద్యాధికారి అనిల్‌కుమార్, తహసీల్దార్ సూర్యారావు, హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

ప్రభావం చూపించని టీడీపీ బంద్ పిలుపు



నందిగామ బస్టాండ్‌లో యథావిధిగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు



పెనుగంచిప్రోలులో యథావిధిగా తెరచి ఉన్న దుకాణాలు

జగ్గయ్యపేట: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును రిమాండ్‌కు తరలించటాన్ని నిరసిస్తూ టీడీపీ చేపట్టిన బంద్‌కు జగ్గయ్యపేట పట్టణంలో స్పందన కరువైంది. పట్టణంలో యథావిధిగానే వాణిజ్య సముదాయాలు నడిచాయి. విజయవాడ డీసీపీ వేజెండ్ల అజిత పట్టణంలోని పలు కూడళ్లలో బందోబస్తు పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని నిబంధనలను అతిక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

నందిగామలో...

నందిగామ: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బంద్ నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దగా ప్రభావం చూపించలేదు. నందిగామ పట్టణంలో తెలుగు తమ్ముళ్లు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొనేందుకు మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఇంటి నుంచి బయటికి వచ్చేందుకు ప్రయత్నించిన సమయంలో పోలీసులు, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఆ సమయంలో ఓ మహిళా కానిస్టేబుల్ అస్వస్థతకు గురయ్యారు. పలువురు వ్యాపారులు దుకాణాలు తీయగా టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యంగా మూయించారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి.

కంచికచర్లలో

కంచికచర్ల: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ నాయకులు సోమవారం బంద్ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మండల కేంద్రమైన కంచికచర్లలో బంద్ ప్రభావం ఏమీ కనిపించలేదు. వ్యాపార సంస్థలు మామూలుగానే పనిచేశాయి. ఆర్టీసీ బస్సులు యథావిధిగా రాకపోకలు సాగించాయి.

వీరులపాడులో...

వీరులపాడు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును రిమాండ్‌కు తరలించటాన్ని నిరసిస్తూ సోమవారం టీడీపీ చేపట్టిన బంద్ వీరులపాడులో పూర్తిగా విఫలమైంది. రోజూ మాదిరిగానే దుకాణదారులు వ్యాపారాలు సాగించగా ఆర్టీసీ సర్వీసులు యథావిధిగా నడిచాయి. పాఠశాలలు పనిచేశాయి. ప్రజల జీవనంపై బంద్ ఏమాత్రం ప్రభావం చూపించలేదు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపు ప్రభావం మండలంలో ఎక్కడా కనిపించలేదు. గ్రామాల్లో హోటళ్లు, దుకాణాలు, టీ స్టాల్స్, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు యథావిధిగా కనిపించాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడక్కడా వీధుల్లోకి వచ్చి దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని కోరగా, వారి ముందు మూసినా, వారటు వెళ్లిన వెంటనే దుకాణాలు, కార్యాలయాలు మళ్లీ యథావిధిగా తెరిచారు.

జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి

డీసీపీ అజిత



సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ అజిత

నందిగామ: జిల్లాలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని డీసీపీ వేజెండ్ల అజిత అన్నారు. బంద్ నేపథ్యంలో సోమవారం ఆమె నందిగామకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులతో పాటు, ప్రత్యేక బలగాలకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో అన్ని ప్రాంతాలలో ముందు జాగ్రత్తగా ప్రత్యేక బలగాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని అన్ని ప్రధాన వీధులలో పోలీసు బలగాలు ప్రత్యేక కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో ఏసీపీ జనార్ధన్ నాయుడు, సీఐలు హనీష్, నాగేంద్ర కుమార్, జానకిరామ్, పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పాలబూత్‌పై టీడీపీ నాయకులు దాడికి యత్నం



జి.కొండూరులో పాలబూత్‌పై దాడికి యత్నిస్తున్న టీడీపీ నాయకులు

జి.కొండూరు: స్థానిక 14వ వార్డు మెంబరు పజ్జూరు నాగమల్లేశ్వరరావుకు చెందిన పాలబూత్‌పై టీడీపీ నాయకులు సోమవారం ఉదయం దాడికి యత్నించారు. ప్రజలకు నిత్యావసరమైన పాలను విక్రయించేందుకు పజ్జూరు నాగమల్లేశ్వరరావు జి.కొండూరు గుడి సెంటర్లో గల తన పాలబూత్‌ను సోమవారం తెల్లవారుజామున తెరిచాడు. కాగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రిమాండ్ విధించిన నేపథ్యంలో నిరసన తెలుపుతూ బంద్‌ను విజయవంతం చేసేందుకు ర్యాలీగా వచ్చిన టీడీపీ నాయకులు పాలబూత్‌పై దాడికి యత్నించారు. ఈ క్రమంలో నాగమల్లేశ్వరరావుకు టీడీపీ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. వెంటనే సమాచారం అందుకున్న జి.కొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గొడవను అదుపు చేశారు.

బంద్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు సిగ్గుచేటు

ఇబ్రహీంపట్నం: స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతి కేసులో అరెస్ట్ అయిన చంద్రబాబుకు, టీడీపీ బంద్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు, జగనన్న అభిమాన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నాగమల్లేశ్వరరావు ఒక ప్రకటనలో సోమవారం ఖండించారు. 2014లో మాదిగల మద్దతుతో అధికారంలోకి వచ్చి, వారిని అణగదొక్కేందుకు చంద్రబాబు ప్రయత్నించిన ఘటన గుర్తులేదా అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగను ప్రశ్నించారు. 2017లో కురుక్షేత్రం మహాసభ జరగనీయకుండా ఉద్యమకారులను అరెస్ట్‌చేసి అక్రమ కేసులు పెట్టినందుకు మద్దతిచ్చారా అని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ముసుగు తొలగించి టీడీపీ కండువా కప్పుకోవాలని హితవు పలికారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మందా కృష్ణమాదిగ మాయలో పడొద్దని పేర్కొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. నందిగామ న్యాయవాది కోట రాజుపై నందిగామ రూరల్ సీఐ దురుసుగా ప్రవర్తించినందుకు నిరసనగా కోర్టు విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక కాంతారావు తెలిపారు. న్యాయవాదులు మెట్టెల ఆంజనేయులు, జూనెబోయిన శ్రీనివాసరావు, నాగరాజు, శ్రావణ్, కృష్ణ, నాగేశ్వరరావు, రాజేష్, గాంధీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

